క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జయలక్ష్మీ థియేటర్ రోడ్డులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు వినకోట సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి వైద్య శిబిరంలో బీపీ, సుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఎటువంటి ఆహారం తీసుకోకుండా పరీక్షలు చేయించుకోవడానికి హాజరుకావాలని సూచించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సామర్లకోట: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడం ద్వారా కుటుంబం, రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం వేట్లపాలెం గ్రామంలోని డొక్కా సీతమ్మ కల్యాణ మండపంలో మండల సమాఖ్య సభ్యులకు రుణ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 48 మండల సమాఖ్యలకు రూ.7.48 కోట్లు బ్యాంకు రుణం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమానికి వెలుగు ఏపీఎం జగదీశ్వరీ అధ్యక్షత వహించగా పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, గ్రామ నాయకులు గుమెళ్ల రామకృష్ణ, తోటకూర శ్రీనివాసు, పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, మండల మహిళా సమాఖ్య కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో గణపతికి ప్రత్యేక పూజలు


పంచారామ క్షేత్రంలో పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఉన్న గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సాయంత్రం లక్ష్మీగణపతి హోమం, పూజా కార్యక్రమాలు చేశారు. స్వామి వారికి వెండి ఆభరణాల అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, అల్లాకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, వేమూరి చంటి, సన్నిధిరాజు భాస్కర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'కొండ' సేవలు అభినందనీయం

సామర్లకోట: స్థానిక భారత ఆహార సంస్థ గిడ్డంగిలో ఎగుమతి, దిగుమతి కార్మిక సంఘ నాయకుడిగా పని చేసిన చల్లా వీరవెంకట ప్రభాకరరావు(కొండ) సేవలు అభినందనీయమని ఎఫ్‌సీఐ డివిజల్ మేనేజరు ఎ.రెడ్డిశేఖర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్) కె.అమూల్య, స్థానిక డిపో మేనేజరు హరిలాల్ రాథోడ్‌లు అన్నారు. కొండ పదవీ విరమణ సందర్భంగా స్థానిక ఎఫ్‌సీఐలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. డిపోలో బియ్యం సకాలంలో లోడింగ్, అన్‌లోడింగ్ అయ్యేలా కొండ కృషి చేశారన్నారు. హమాలిస్ సభ్యులతో ఎటువంటి సమస్యలు లేకుండా కార్మికులందరూ ఐక్యతతో పనిచేసేలా చేశారని పేర్కొన్నారు. ఆయనను మిగిలిన కార్మికులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎఫ్‌సీఐ ఉంచి ఊరేగింపుగా ఆయన స్వగ్రామం హుస్సేపురం బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పుల మధ్య తీసుకువచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ఎఫ్‌సీఐ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శివసత్య పాల్గొన్నారు.

పట్టణంలో పడకేసిన పారిశుధ్యం

- వీధుల్లో పందుల స్వైర విహారం
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- తూతూమంత్రంగా నిర్మూలనా చర్యలు
- నిర్లక్ష్యంగాలో అధికార యంత్రాంగం


పట్టణంలో గుంపుగా తిరుగుతున్న పందులు

పెద్దాపురం: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులతో అనారోగ్యానికి గురైనప్పుడే మున్సిపల్ అధికారులకు పరిశుభ్రత, పారిశుధ్యం గుర్తొస్తోంది. నిత్యం పట్టణంలో రద్దీగా ఉండే జనవాసాల మధ్య పందులు గుంపుగా స్వైర విహారం చేస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. పెద్దాపురం పట్టణంలో ఏళ్ల తరబడిగా సీజనల్ సమయంలో పట్టణానికి ఏదో మూల ప్రాంత ప్రజలను డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలుతూనే ఉంటాయి. అయితే ఆ సమయంలో అధికారులు మందుస్తు చర్యలు చేపడతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప వాటిపై చర్యలు తీసుకోవడం లేదనడానికి ఈ పందుల స్వైర విహారమే నిదర్శనం. ఇటీవల పట్టణంలో పందుల నిర్మూలన చేస్తున్నామని హామీలిచ్చారే తప్ప ఆచరణ అంతంత మాత్రంగానే సాగించారు. పందుల పెంపకందారులకు నోటీసులు జారీ చేశామని ఇదిగో ఇదిగో అంటూ కాలయనాపన చేస్తున్నారే తప్పా ప్రభుతం సరైన జీవో జారీ చేసినా పట్టణంలో పందుల నిర్మూలనపై చర్యలు చేపట్టిన దాఖల్లాలేవు.

ఫిర్యాదులు అందినా..

గతంలోనూ, ప్రస్తుతం పెద్దాపురం ఫేస్‌బుక్, ఆల్ ఈజ్ వెల్ గ్రూపుల్లో పందుల స్వైర విహారంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను నిలదీయాలని మెసెజ్‌లు పంపించి అధికారుల దృష్ట్య తీసుకువెళ్లినా వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన పాపన పోలేదు. పందులు వల్లే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పట్టణానికి దూరంగా పందులు ఉన్నా పర్వాలేదంటూ పందుల యజమానులకు హుంకుం జారీ చేసిన మున్సిపల్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహిరించడం విడ్డూరం. పందుల సంచారం వల్ల ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పట్టణంలో పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోగాలపాలవుతున్నాం



పందుల స్వైర విహారం కారణంగా ప్రజలు రోగాల బారినపడుతున్నా పట్టించుకోవడం లేదు. పట్టణంలో ఏ మూల చూసినా పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చర్యలు తీసుకోవాలంటే అధికారులు కాలయాపన చేస్తున్నారు గానీ వాటి కోసం పట్టించుకోవడంలేదు.

– తాడి కస్తూరి, గృహిణి, నాగంపేట, పెద్దాపురం

నోటీసులు ఇచ్చాం



పందుల స్వైర విహారంపై సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చాం. అయినా పందుల సంచారంపై కింది సిబ్బందికి పూర్తి ఆదేశాలిచ్చాం. వెంటనే పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం. ఇకపై శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం


లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్వామివారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యాక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వాకతిప్పలోని పద్మశాలి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండలంలో శనివారం సామూహిక లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. కొత్తపల్లి పోలమ్మగుమ్మం సెంటర్‌లోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేయని పనులకు బిల్లులా?


మున్సిపల్ అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్


అధికారుల అక్రమ బిల్లులపై వినతిపత్రం ఇస్తున్న రాజశేఖర్

- సీఎం పర్యటన వంకతో అక్రమంగా బిల్లులు పెట్టిన అధికారులు
- మున్సిపల్ ఖజానా దోపిడీకి ఇంత దారుణమా!
- అధికారుల నిర్వాకంపై సభ్యుల ఆగ్రహం
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ ఖజానాను దోపిడీ చేయడానికి సీఎం పర్యటనను అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా చేయని పనులకు బిల్లులు పెడితే క్షమించేది లేదని పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ మండిపడింది. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు, పప్పల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో సీఎం పర్యటన సమయంలో మున్సిపల్ ఖజానా నుంచి చేయని పనులకు బిల్లులు పెట్టటం సరికాదన్నారు. జంగిల్ క్లియరన్స్ చేయని పనులకు ఐదు లక్షలు వేశారంటే అధికారులు తీరు మున్సిపల్ ఖజానా దోపిడీ అర్థమవుతోందంటూ మండిపడ్డారు. సత్వరమే బిల్లులు సరిచేసి తదుపరి సమావేశంలో క్షుణ్ణంగా బిల్లు పెట్టాలని, అప్పటి వరకు అజెండాలోని మూడో అంశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ తమ వార్డులో మరిడమ్మ గుడి వద్ద ఉన్న మనోజ్ చెరువు జంగిల్ క్లియరన్స్‌కు రూ.69 వేలు, దర్గా సెంటర్ నుంచి కొత్తపేట చెరువు వరకు రూ.96 వేలు, ఏడీబీ రోడ్డు నుంచి గుర్రాల సెంటర్ వరకు రూ.98 వేలు, మరిడమ్మ గుడి నుంచి దర్గా సెంటర్ వరకు రూ.94 వేలు, కొండయ్యపేట నుంచి ప్రసన్నాంజనేయ స్వామి గుడి వరకు రూ.90 వేలు, హెలీప్యాడ్ వద్ద లెవిలింగ్, జంగిల్ క్లియరన్స్‌లకు రూ.98 వేలు వెరసీ జంగిల్ క్లియరన్స్, బెర్మ్, వేస్ట్ మెయింట్‌నెన్స్‌కు రూ.5,40,000 బిల్లులు పెట్టారన్నారు. అయితే ఆయా ప్రదేశాల్లో ఎక్కడ అంత సొమ్ములు కేటాయించి జంగిల్ క్లియరన్స్ చేసిన పనులు కనిపించడంలేదన్నారు. మొక్కలు, తుప్పలు, డ్రైన్‌లు లేని చోట జంగిల్ క్లియరన్స్ అంటూ తప్పుడు బిల్లులు పెట్టడం ఏంటని డీఈ ప్రకాశరావును నిలదీశారు. మున్సిపాలిటీకి జేసీబీ ఉండగా, శానిటరీ సిబ్బంది ఉండగా అదనంగా కాకినాడ, సామర్లకోట, పిఠాపురం మున్సిపాలిటీ నుంచి 150 మంది శానిటరీ సిబ్బంది ఉండగా జంగిల్ క్లియరన్స్‌కు అంత ఖర్చు చేశారన్నారు. సీఎం పర్యటన సమయంలో చిన్న మున్సిపాలిటీకి ఆర్థిక భారం పడకుండా జిల్లా కలెక్టర్‌తో మంజూరు చేసిన గ్రాంట్ నుంచి ఈ ఖర్చులు పెడితే బాగుటుందన్నారు. ఇంత దారుణంగా పెట్టిన బిల్లు అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్ పర్సన్ తులసీ మంగతాయారు ప్రకటించారు. కౌన్సిలర్ పప్పల దుర్గారావు మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కమిషనర్ హాజరు కావాలని ఆయన ఉంటేనే సభ్యుల ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం వస్తుందన్నారు. వార్డుల్లో ఎక్కడా చేయని పనులకు ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు పెట్టడం సరికాదన్నారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో సుమారు కోటి రూపాయల నిధులతో చేపట్టే పనులు కాంట్రాక్టర్ పూర్తి చేయకపోతే ఎందుకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం లేదని ప్రశ్నించారు. అవే పనులు వేరే కాంట్రాక్టర్‌కు అప్పగించి వాయిదా వేసుకుంటూ వస్తే ఎప్పుడు ఆ పనులు పూర్తవుతాయని ఆగ్రహించారు. సత్వరమే 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చ సాగింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు ముప్పన శ్యామలాంబ, ఆకుల కృష్ణబాపూజీ, త్సలికి సత్యభాస్కర్‌తో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సందడిగా నిమజ్జనాలు


స్వీట్ గణపతి (పిఠాపురం జై గణేష్ ఆలయంలో స్వీట్లతో వినాయకుడికి అలంకారం)


గొల్లప్రోలులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న పోలీసులు

పిఠాపురం: గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు ప్రారంభమైన మూడో రోజు నుంచి నిమజ్జనాలు ప్రారంభమవుతాయి. మూడో రోజు శుక్రవారం రావడంతో నాల్గో రోజు శనివారం నుంచి నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిమజ్జనాల సందడి నెలకొంది. పిఠాపురం పట్టణంతో పాటు మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు మండలాల్లో పలు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి పిఠాపురంలోని ఏలేరు, పీబీసీ కాలువల్లో నిమజ్జనం చేశారు. కొందరు విగ్రహాలను ఉప్పాడ సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని ఎస్సై ఎన్. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గొల్లప్రోలు ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఏలేరు, పీబీసీ, ఉప్పాడ సాగరతీరంలో నిమజ్జనాలు చేసే ప్రాంతాలను గుర్తించి వాటి వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7న చంద్రగ్రహణం ఉండడంతో 6వ తేదీ లోపు నిమజ్జనాలు పూర్తి చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మురికివాడలపై అధికారుల నిర్లక్ష్యం

- అజెండాలో రెండు అంశాలు తిరస్కరణ
- అంధకారంలో కౌన్సిల్ సమావేశం
- సెల్ ఫోన్ లైట్లతో సభ్యుల నిరసన


సామర్లకోట కౌన్సిల్ సమావేశంలో సెల్‌లైట్లతో నిరసన తెలిపిన వైస్‌చైర్మన్, సభ్యులు


సభ్యులకు సమాధానం ఇస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: నెలకు ఒకసారి జరిగే కౌన్సిల్ సమావేశం సమయంలో జనరేటర్ పని చేస్తుందో లేదో చూడకుండా సమావేశం నిర్వహించడంపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశం జరిగింది. సమావేశం జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడం, జనరేటర్ పని చేయకపోవడంతో వైస్‌చైర్మన్ ఉబాజాన్‌మోజెస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న జనరేటర్‌కు, వాటర్ ప్లాంటు వద్ద ఉన్న జనరేటర్‌కు ఎంత ఆయిల్ వినియోగిస్తున్నారని నేతల హరిబాబు ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో నెలకు 50 లీటర్లు, వాటర్ ట్యాంకుల వద్ద 200 లీటర్ల ఆయిల్ వినియోగిస్తున్నట్టు మున్సిపల్ కమిసనర్ ఎ.శ్రీవిద్య సభ్యులకు తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రజల కుళాయి పన్ను రూ.75 నుంచి రూ.100కు పెంచడానికి సభ్యులు వ్యతిరేకించారు. గత రెండు నెలలు కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా పాత అంశాన్ని అజెండాలోనికి తీసుకురావడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ 7వ అంశాన్ని వాయిదా వేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, మున్సిపాలిటీ పరిధిలోని మురికివాడలపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని వైస్ చైర్మన్ ఉబాజాన్‌మోజెస్‌తోపాటు వైఎస్సార్ సీపీ సభ్యులు కరణం రాజ్‌కుమార్, రెడ్నం సునీత, పాలిక కుసుమ, కాళ్ల శ్యామల, ఆవాల లక్ష్మీనారాయణ, చిట్టుమాని రాఘవ, పెండ్యాల వెంకటలక్ష్మి ధ్వజమెత్తారు. దీంతో పట్టణంలో సమస్యల పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిల్ టెండర్లు పిలిచిన అనేక అభివృద్ధి పనుల ఏడాది నుంచి అనేక మంది కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించడంలేదని, అటువంటి కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని వైస్ చైర్మన, సభ్యులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై చర్యలు తీసుకోవడంలేదని మోజెస్ ఆరోపించారు. మూడు నోటీసు ఇచ్చిన వారిని బ్లాక్ లిస్టులో పెడతామని కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. నెలకు ఒకసారి జరిగే కౌన్సిల్ సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కంట తడి పెట్టిన కమిషనర్

కౌన్సిల్ సమావేశం ముగిసిన అనంతరం కమిషనర్ ఎ.శ్రీవిద్య చైర్‌పర్సన్ సునేత్రాదేవి చాంబర్‌లోనికి వెళ్లి కంట తడి పెట్టుకున్నారు. సభ్యులందరూ ఒకేసారి తనపై విరుచుకుపడడంతో బాధగా ఉందన్నారు. జనరేటర్ పని చేయకపోతే తనను బాధ్యురాలిని చేయడమేంటని అన్నారు. మిగిలిన సభ్యులు చైర్‌పర్సన్ చాంబర్‌లోనికి రావడంతో కమిషనర్ తన చాంబర్‌లోనికి వెళ్లిపోయారు.

ఎమ్మెల్యే గైర్హాజరైతే ఎలా ?


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

- అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం: ఏ పార్టీ అధికారంలో ఉన్నా మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే హారవుతారని, కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిన్నరగా ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ రాకపోవడమేమిటని కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ పెదపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసినట్టు ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి తప్ప, పిఠాపురం పట్టణంలో ఏ విధమైన అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ పిఠాపురం మున్సిపాలిటీకి ఎప్పుడు వస్తారని, అభివృద్ధి జరిగే సూచనలు ఏమైనా ఉన్నాయా ? అని పలువురు కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. సమావేశాలకు రావాలని ఎమ్మెల్యేకు అసలు ఆహ్వానం ఇస్తున్నారా ? లేదా ? అని ఆరా తీశారు. కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిఠాపురం పట్టణంలో జనాభా పెరుగుతోందని, శానిటేషన్ వర్కర్లను పెంచాలని సూచించారు. సుమారు లక్ష మంది జనాభా ఉన్నారని, శానిటేషన్ సిబ్బంది 76 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అదనపు శానిటేషన్ సిబ్బంది తెప్పించే విధంగా కమిషనర్ కృషి చేయాలన్నారు. కౌన్సిలర్లు బోను దేవా, అల్లావరపు నగేష్, సోమరాజు లలితాదేవి, రాయుడు శ్రీను మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నగేష్ మాట్లాడుతూ కుక్కలు, ఆవులు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బోనాసులు శివ మాట్లాడుతూ తాగు నీరు సరఫరా చేసే ట్రాక్టర్ టైర్లు అరిగిపోయి తరచూ ప్రమాదానికి గురవుతున్నాయని తెలిపారు. పుర ప్రజలకు అమృత పథకం ఎప్పుడు అందజేస్తారని, అమృతం విషయమయ్యే పరిస్థితి చేరుకుందన్నారు. లలితాదేవి, కోళ్ల బంగారు బాబు మాట్లాడుతూ కుళాయిలు లేకుండా కుళాయి పన్నులు కట్టమని నోటీసులు వస్తున్నాయన్నారు. ఇంటి పన్నులు కూడా డబల్ వస్తున్నాయని, వీటిని సరిచేయాలని కమిషనర్‌ను కోరారు. అజెండాలో అంశాలను కౌన్సిలర్లు ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ నామ కనకారావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాశీ ఖండం తెలుగు అనువాదం అద్భుతం


సమావేశంలో మాట్లాడుతున్న సంస్కృతాంధ్ర పండితుడు మద్దాలి సత్యనారాయణ

బోట్‌క్లబ్: స్కాంద పురాణ అంతర్గతమైన సంస్కృత భాషలోని కాశీ ఖండాన్ని శ్రీనాథుడు తెలుగు లో అద్భుతంగా అనువాదించి మనల్ని పునీతుల్ని చేశారని సంస్కృతాంధ్ర పండితులు మద్దాలి సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో శనివారం గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మద్దాలి కాశీ ఖండం అద్భుత ఘట్టంపై ప్రసంగించారు. నర్మదా నది పరివాహక ప్రాంతాల పకృతిని మహోన్నత వనాలను, మారేడు, మేడి చెట్లను శివుని స్థితిగతులతో సరిపోలుస్తూ శ్రీనాథుడు చేసిన వర్ణన ప్రఖ్యాతి గాంచిందని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్కృత ప్రచార సభ అధ్యక్షుడు జీవీకే వర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు ద్వారా భారతీయ తాత్త్వికత ప్రచారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత ప్రచార సభ ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామ చంద్ర మూర్తి, కోశాధికారి చింతపల్లి సుబ్బారావు, సభ్యులు డాక్టర్ ఆకెళ్ళ శ్రీరామ మూర్తి, భమిడి మూర్తి పాల్గొన్నారు.